సాక్షి
కుమురం భీం
ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



గూడెం గూడు కట్టుకుంది

ఓ గూడెంలో పట్టు తప్పిన పటేల్‌ను కాదని ఊరే తరలిపోయింది. కొత్తగా గూడేన్ని నిర్మించుకుంది. పాండుగూడ కోసుపటేల్‌గూడగా మారిన తీరుపై కథనం..

8లో ▸



అటు భగభగ.. ఇటు గజగజ!

ఓ వైపు చలి తీవ్రత తగ్గలేదు. మరోవైపు పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. పగలంతా ఎండగా ఉంటోంది. రాత్రి వేళ చలి తీవ్రత కొనసాగుతోంది.

9లో ▸



వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ చలి కొనసాగుతుంది. మధ్యాహ్నం వేడి వాతావరణం ఉంటుంది.

ఉక్కిరి బిక్కిరి

- అంగన్‌వాడీలకు విద్యుత్ సౌకర్యమేది?
- వేసవి ప్రారంభం.. ఉక్కపోత మరూ..
- ఇబ్బందుల్లో చిన్నారులు, మహిళలు



ఇది దహెగాం మండలం అమరగొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం. పక్కా భవనం లేక అద్దె ఇంట్లో కొనసాగుతోంది. దీని పరిధిలో 31 మంది చిన్నారులు, ఐదుగురు బాలింతలు, ఐదుగురు గర్భిణులున్నారు. కేంద్రంలో సరైన వసతులు లేవు. ప్రధానంగా విద్యుత్ బల్బులు వెలగక, ఫ్యాన్లు తిరగక చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ఇందులో మరుగుదొడ్లు కూడాలేవు. తాగునీరు అందక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులకు గురవుతున్నారు. అద్దె భవనంలో కొనసాగుతున్నందున నెలకు రూ.వేయి అద్దె చెల్లిస్తున్నారు. పక్కా భవనం నిర్మించాల్సిన అవసరం ఉంది.



అమరగొండ అంగన్‌వాడీ కేంద్రంలో చీకటి గది.. ఉక్కపోతలో కూర్చున్న చిన్నారులు



ఇది కౌటాల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–1. ఈ భవనం ఐటీడీఏ ద్వారా 30 ఏళ్ల క్రితం నిర్మించారు. ఇందులో 99 మంది చిన్నారులున్నారు. కేంద్రానికి విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో చిన్నారులతోపాటు ఆరుగురు గర్భిణులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. మండల కేంద్రంలోనే ఇలాంటి దుస్థితి నెలకొంటే మారుమూల గ్రామాల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఇది సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని పేట్‌మెరా అంగన్‌వాడీ–3 కేంద్రం. పక్కా భవనం లేక అద్దె ఇంట్లో కొనసాగుతోంది. ఈ కేంద్రం పరిధిలో 20 మంది చిన్నారులు, 16 మంది గర్భిణులు, ఐదుగురు బాలింతలున్నారు. కరెంట్ సౌకర్యం ఉన్నా పక్కా భవనం లేదు. తాగునీటి సౌకర్యం ఉంది. మరుగుదొడ్లు లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. పక్కా భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



దహెగాం: చిన్నారులను బడికి అలవాటు చేయడానికి ముఖ్యపాత్ర పోషించేవి అంగన్‌వాడీ కేంద్రాలు. ముందుగా అక్షరాలు దిద్దాల్సింది ఇందులోనే. ఆటపాటలతో చిన్నారులను బడికి అలవాటు చేస్తారు. కాగా, వేసవిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉక్కపోతతో చిన్నారులు సతమతమవుతున్నారు. ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవు. దీంతో బాల బడుల్లో చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తల్లిదండ్రులు కేంద్రాలకు చిన్నారులను పంపడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేనందున టీచర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులు ఖాళీగా ఉండడంతో కేంద్రాల నిర్వహణ సక్రమంగా కొనసాగడం లేదు. మరుగుదొడ్లు లేని చోట సిబ్బంది బాధలు వర్ణనాతీతం.

జిల్లాలో 973 కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా 834 అంగన్‌వాడీ కేంద్రాలు, 139 మినీ కేంద్రాలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చింది. దీంతో జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య 973కు చేరింది. చాలా కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవు. ప్రతీ కేంద్రంలో ఒక టీచర్, ఆయా ఉండాలి. ప్రస్తుతం కేంద్రాల్లో 786 మంది పని చేస్తుండగా మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో 101 మంది పని చేస్తున్నారు. దీంతో 86 అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 716 మంది ఆయాలు విధులు నిర్వర్తిస్తుండగా 257 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఇన్‌చార్జీలకు అప్పగించి వాటిని కొనసాగిస్తున్నారు. దీంతో నిర్వహణ సరిగా లేదన్న ఆరోపణలున్నాయి. ఏడాదిన్నర క్రితం అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేశారు. అప్పటి నుంచి భర్తీ ప్రక్రియ కొనసాగడం లేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ గాడి తప్పుతోందన్న విమర్శలున్నాయి. అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉండగా.. పోషకాహారంపై అవగాహన కల్పించడంలేదు. కొన్నిచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

జిల్లా సమాచారం

అంగన్‌వాడీ కేంద్రాలు:	973
ఆరేళ్లలోపు చిన్నారులు:	45,260
గర్భిణుల సంఖ్య:	4,896
బాలింతల సంఖ్య:	4,409
టీచర్ పోస్టుల ఖాళీలు:	86
ఆయా పోస్టుల ఖాళీలు:	257

విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం

కలెక్టర్, విద్యుత్ అధికారులతో మాట్లాడి అంగన్‌వాడీ కేంద్రాల్లో కరెంట్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటాం. అంగన్‌వాడీ, ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ప్రభుత్వం వేయాల్సి ఉంది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఖాళీలను భర్తీ చేస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా కొనసాగిస్తాం.

– భాస్కర్ ఐసీడీఎస్ పీడీ

45,261 మంది చిన్నారులు..

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులు 45,261 మంది ఉన్నారు. చాలా కేంద్రాల్లో చాలాచోట్ల విద్యుత్ సౌకర్యం లేక చిన్నారులు ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేని కారణంగా చిన్నారులు, టీచర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 4,896 మంది గర్భిణులున్నారు. 4,409 మంది బాలింతలున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వేసవి తీవ్రత పెరుగుతున్నందున విద్యుత్ సౌకర్యం లేని చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



సుర్దాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

కెరమెరి: పార్లమెంట్ ఎన్నికల్లోపు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ సూచించారు. శనివారం మండలంలోని కెరమెరిలో నాలుగు పోలింగ్ బూత్ కేంద్రాలతో పాటు ధనోరా, కొఠారి, మోడి, గోయగాం, రింగన్‌ఘాట్, సుర్దాపూర్ తదితర పోలింగ్ కేంద్రాలు, బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ర్యాంపులు, మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. ఆయన వెంట డీటీ సంతోష్‌కుమార్, రెవెన్యూ అధికారులు సిద్దార్థ, సేవంతా, బీఎల్వోలు, ప్రధానోపాధ్యాయులున్నారు.

ముగిసిన రథసప్తమి వేడుకలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాలేశ్వరస్వామి ఆలయంలో రథ సప్తమిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న నవరాత్రోత్సవాలు ముగిశాయి. శనివారం ఉదయం అర్చకుడు చందావార్ శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో గవ్యాంత పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలువురు దంపతులు హోమంలో పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం బాలేశ్వరుడికి అన్నపూజ, మహాపూర్ణాహుతి, కుంబాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. రాత్రి స్వామి వారి ఉత్సవ మూర్తులతో పుర వీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని డీఐఈవో శంకర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫేర్‌వెల్ డే నిర్వహించగా శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యాపకుల సలహాలు తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాందాస్, మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య, అధ్యాపకులు శ్రీనివాస్, చంద్రయ్య, సంతోష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణే పోలీసుల ధ్యేయం

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలు, చిన్నారుల రక్షణే పోలీసుల ధ్యేయమని ఎస్పీ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం అడిషనల్ డీజీపీ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మహిళా భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహిళల భద్రతకు భరోసానిస్తూ బాధిత మహిళలు, పిల్లలను అక్కున చేర్చుకుని కొండంత ధైర్యాన్నిస్తుందని చెప్పారు. మహిళలు, పిల్లల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా భరోసా కేంద్రాలు సేవలందిస్తున్నాయని తెలిపారు. భరోసా సెంటర్ ద్వారా వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన పోక్సో, అత్యాచార కేసుల్లో కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు చిల్డ్రన్ వెల్‌ఫేర్ కమ్యూనిటీ ద్వారా బాధితులకు షెల్టర్ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వేధింపులు, అత్యాచార బాధిత మహిళలు, పిల్లలకు ఒకేచోట మెడికల్, న్యాయసలహాలు, కౌన్సెలింగ్ లాంటి సేవలు అందనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, సీఐలు రమేశ్, సతీశ్, ఎస్సై రాజేశ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

21న లోక్‌అదాలత్ సన్నాహక సమావేశం

ఆసిఫాబాద్: ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయలోక్ అదాలత్ సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని ఈ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యలు, మోటార్ వెహికిల్ ప్రమాదాలు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్, లిటిగేషన్, ఇతర కేసులను పరిష్కరించనున్నట్లు వివరించారు. సమావేశానికి జిల్లాలోని పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఈవీఎంలపై అధికారులకు అవగాహన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు

ఆసిఫాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర ముఖ్యమైందని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, వేణు సూచించారు. ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగా ఉండాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలపై సెక్టోరల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లను తమ పరిధిలోని సెక్టార్ అధికారులు చూసుకోవాలని సూచించారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు హ్యాండ్ బుక్, పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ అమర్చడం, మాక్ పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల్లో 17సీ డైరీ, ప్రిసైడింగ్ డైరీపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- ఎస్పీ కే సురేశ్‌కుమార్



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

తిర్యాణి: మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని ఎస్పీ కే సురేశ్‌కుమార్ సూచించారు. 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మానిక్యాపూర్, గడలపల్లి గ్రామాల్లో పోలీస్‌శాఖ, వసుధ స్వచ్ఛంధ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ తరగతులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 31మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. మహిళలు, యువతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఒకరిపై ఆధార పడకుండా స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు వసుధ సంస్థ సహకారంతో 200 కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పిల్లల భవిష్యత్ తల్లిదండ్రులపై ఆధారపడి ఉంటుందని, పిల్లల్ని క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలన్నారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో అనుమానితులు, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, వసుధ స్వచ్ఛంధ సంస్థ కోఆర్డినేటర్ ఉమ, రెబ్బెన సీఐ చిట్టిబాబు, తిర్యాణి ఎస్సై రమేశ్, గడలపల్లి మాజీ సర్పంచ్ గుణవంత్‌రావు, జిల్లా సార్మెడి మోతీరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు రుణాలివ్వాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యం మేరకు రుణాలివ్వాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో భాగంగా జిల్లాలోని పీవీటీజీలకు 100 శాతం బ్యాంక్ ఖాతాలు తెరవాలని, ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద దరఖాస్తు చేసుకున్న 18 రకాల చేతి వృత్తుల కళాకారుల్లో అర్హులను ఎంపిక చేసి బ్యాంకు అధికారి, జిల్లా అధికారుల సమన్వయంతో రుణాలందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పంట రుణాల ప్రకారం రైతులందరికీ రుణాలు అందించేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. మహిళా స్వావలంబనకు ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న స్త్రీనిధి, ఇతర ఆర్థిక చేయూత రుణాలు సకాలంలో అందించాలని ఆదేశించారు. ఈ ఆర్థికసంవత్సరంలో 2,653 కోట్ల వార్షిక రుణ లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ హనుమంతారావు, ఎల్డీవో అనిల్‌కుమార్, నాబార్డ్ డీడీఎం అబ్దుల్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీటీడీవో రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

రెబ్బెన: గోలేటి పంచాయతీ పరిధిలోని మానెపల్లి కుంట పూడికతీత పనుల్లో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మానెపల్లి కుంటను బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానెపల్లికుంట అభివృద్ధికి రూ.9.32 లక్షల ఈజీఎస్ నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. శిలాఫలకాన్ని వేసి నామమాత్రంగా పనులు చేపట్టి లక్షల రూపాయలు కాజేశారని ఆరోపించారు. చెరువుకు ఉన్న ఏకైక తూముకు గేటు ఏర్పాటు చేయకపోవటంతో 200 ఎకరాల ఆయకట్టుకు నీరు అందక రైతులు పంటలను పండించలేకపోతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన తాజా మాజీ సర్పంచ్ పోటు సుమలత ఎన్నికలకు ముందు తనను గెలిపిస్తే సింగరేణి సహకారంతో మానెపల్లికుంట ద్వారా రెండు పంటలకు సాగునీరు అందిస్తామని, మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తామని హామీ ఇచ్చి గెలిచిన తరువాత చెరువులను పట్టించుకోకుండా రైతులను మోసం చేశారని ఆరోపించారు. గోలేటి రిజర్వాయర్ 800 ఎకరాలకు నీరు అందించాల్సి ఉండగా రెండు తూములు, కాలువలు చెడిపోయి రెండేళ్లుగా సాగునీరు అందక రైతుల పంటపొలాలు బీళ్లుగా మారిపోయాయని పేర్కొన్నారు. చెరువుల పూడికతీత పనుల పేరుతో లక్షల నిధులు దుర్వినియోగమయ్యాయని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, మండల ప్రధాన కార్యదర్శులు ఓదెలు, నవీన్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మానెపల్లికుంటలోని బోర్డు పరిశీలిస్తున్న నాయకులు

రూ.కోటికి టోకరా..!

- కాగజ్‌నగర్‌లో చిట్టీల వ్యాపారి మోసం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌లో నివాసముంటున్న ఓ మహిళ చిట్టీల పేరిట భారీ మోసానికి పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే.. కాగజ్‌నగర్ పట్టణంలోని బా లాజీనగర్‌లో నివాసముంటూ సదరు మహిళ పలువురితో చిట్టీలు వేయించేది. రూ.కోటి మేరకు టోకరా పెట్టినట్లు శని వారం తెలిసింది. ఈ విషయం తెలియటంతో చిట్టీ వేసిన సభ్యులు అంతా హైరానా పడుతున్నారు. తమ డబ్బులు ఎలా వస్తాయో తెలియక దిగాలు పడుతున్నారు. ఎనిమిదేళ్లుగా చిట్టీలు సక్రమంగా నడిపినట్లు తెలిపారు. ఆరు నెలలుగా చిట్టీలు, చెల్లింపులు సక్రమంగా చేయడం లేదని తెలిసింది. ఇదే కాలనీలో కొందరు వడ్డీ చొప్పున డబ్బులు రూ.లక్షల్లో ఇచ్చినట్లు సమాచారం. అయితే 27 మందికి కోర్టు నుంచి ఐపీ ఆర్డర్లు వచ్చాయి. దీంతో ఏమి చేయాలో తెలియడం లేదని వారు వాపోతున్నారు.

'తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి రానివ్వొద్దని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా, మండల పంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండే గ్రామాలను గుర్తించి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు అందించాలని ఆదేశించారు. పైప్‌లైన్ల మరమ్మతుతో పాటు ఇతర సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. డీపీవో ఒమర్ హుస్సేన్, మిషన్‌భగీరథ ఈఈ వెంకటపతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలి

రెబ్బెన: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గంగాపూర్ జాతర ఏర్పాట్లను స కాలంలో పూర్తి చేయాలని డీపీవో ఉమర్ సూ చించారు. శనివారం గంగాపూర్ ఆలయ పరిసరాల్లో కొనసాగుతున్న జాతర ఏర్పాట్లను మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామి రథోత్సవం నిర్వహించే ప్రాంతాన్ని త్వరగా సిద్ధం చేయాలని, గంగా పూర్ వాగులో రథోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. జా తరకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్నందున పరిసరాల్లో పారిశుధ్యం లోపికుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. షిఫ్టుల వారీగా పంచాయతీ కార్మికులతో ఎప్పటికప్పుడు ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. జాతరలో ప్లాస్టిక్ కవర్లను వినియోగించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. భక్తులకు తాగునీరు, మ రుగుదొడ్ల సౌకర్యం అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జాతర ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీవో శంకరమ్మ, మాజీ సర్పంచ్ గంటుమేర, ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి మురళీధర్, బీఆర్ఎస్ నాయకుడు జుమ్మిడి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీపీవో ఉమర్

గూడెం.. గూడు కట్టుకుంది!

ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తారు. కట్టుబాట్లకు కట్టుబడి పని చేస్తారు. కానీ ఓ గూడెంలో పట్టు తప్పిన పటేల్‌ను కాదని ఊరే తరలిపోయింది. కొత్తగా గూడెం నిర్మించుకుంది. దీంతో ఆ గూడెంలో కట్టుబాట్లు పెట్టిన పటేల్, ఆయన బంధువు మాత్రమే మిగిలారు. గూడెం మొత్తం తరలిపోయి కొత్త గూడెం నిర్మించుకోవడంతో పాత గూడెంలో మొండి గోడలతో శ్మశాన వాతావరణం తలపిస్తోంది. కొత్త గూడెం కొత్త సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లతో కళకళలాడుతోంది. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పాండుగూడ.. కోసుపటేల్‌గూడగా మారిన తీరుపై ప్రత్యేక కథనం.

– ఇచ్చోడ(బోథ్)

సండే స్పెషల్


నూతనంగా ఏర్పాటు చేసుకున్న కోసుపటేల్‌గూడ

- పటేల్‌ను కాదని.. సొంతంగా ఊరు పొందిక
- రూ.25 లక్షలతో ఆరు ఎకరాలు కొనుగోలు..
- 28 నివాసాలు.. బడి, గుడి నిర్మాణం
- పాండుగూడ.. కోసుపటేల్ గూడగా..

కట్టుబాటుకు కట్టుకున్న ఇండ్లు వదిలి..

ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని మారుమూల గిరిజన గ్రామం పాండుగూడ. అక్కడ నివసించే వారంత ఆదివాసీలే. ప్రశాంత వాతావరణంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే ఆదివాసీలకు మూడేళ్ల క్రితం కట్టుబాట్లు అడ్డువచ్చాయి. గూడెంలోని గ్రామ పటేల్‌కు, గ్రామస్తులకు పొసగడం లేదు. మూఢనమ్మకాలు, గ్రామలెక్కలపై వివాదం తలెత్తింది. దీంతో అప్పటి వరకు కలిసి కట్టుగా ఉన్న గూడెంలో ఒక్కసారిగా వివాదం మొదలైంది. గ్రామస్తులంతా ఒకవైపు, పటేల్.. ఆయన సమీప బంధువు కుటుంబం మరోవైపు అయ్యాయి. ఆదివాసీ సంఘలు, సార్‌మేడిల కుల పెద్దల ద్వారా పంచాయితీలు కూడా పెట్టుకున్నారు. కానీ పరిష్కారం దొరకకపోగా సమస్య మరింత జటిలమైంది. గ్రామస్తులంతా పటేల్‌ను వ్యతిరేకించడంతో తమ పట్టా భూముల్లో ఇళ్లు కట్టుకున్న వారంతా ఖాళీ చేసి వెళ్లిపోవాలని పటేల్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో 28 ఆదివాసీ కుటుంబాలు తాము నిర్మించుకున్న ఇళ్లను సైతం ఖాళీ చేసి పిల్లాపాపలతో, కట్టుబట్టలతో గూడెం ఖాళీచేసి వెళ్లిపోయారు.

కోసుపటేల్‌గూడ ఏర్పాటు

పాండుగూడ నుంచి ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయిన ఆదివాసీలు మొక్కవోని ధైర్యంతో మరో గూడెం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున జమ చేసి ఆరెకరాల వ్యవసాయ భూమిని రూ.25 లక్షలకు కొనుగోలు చేశారు. నూతనంగా గూడెం ఏర్పాటు చేసుకుని 28 కుటుంబాలు తాత్కాలికంగా ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. కోసు పటేల్ గూడగా నామకరణం చేశారు. గూడేనికి నూతనంగా పటేల్, దేవారి, మహాజన్, పూజారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


పాండుగూడలో పటేల్ నివాసం ఉంటున్న ఇల్లు


ఖాళీ అయిన పాండుగూడ

పాడుబడిన పాండుగూడ...

పాండుగూడను విడిచి 28 కుటుంబాలు వెళ్లి పోవడంతో ఆగూడెం పాడుబడిపోయింది. గూడెంలో మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. గూడెంలో పటేల్‌తో పాటు మరో కుటుంబం మాత్రమే నివాసం ఉంటున్నారు. పాండుగూడలో ఉన్న పాఠశాల, ఓవర్‌హెడ్ ట్యాంకు మూతబడి పోయాయి.

ట్రస్టు ద్వారా పాఠశాల నిర్మాణం..


అభినవ్‌సర్దార్ ట్రస్టు ద్వారా కోసుపటేల్ గూడలో నిర్మించిన పాఠశాల

నూతనంగా ఏర్పడిన కోసు పటేల్ గూడలో మూడెళ్ల నుంచి పాఠశాల భవనం లేదు. దీంతో రేకుల కొట్టంలో పాఠశాల నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న అభినవ్ సర్దార్ ట్రస్టు చైర్మన్ అభినవ్‌సర్దార్ గ్రామాన్ని సందర్శించారు. రూ.3 లక్షల ఆర్థికసాయం అందించి పాఠశాలకు భవనం నిర్మించి ఇచ్చారు. దీంతో కోసుపటేల్ గూడలో ఆదివాసీ విద్యార్థులు పాఠాలు నేర్చుకుంటున్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



కోసుపటేల్ గూడలో మూడేళ్ల నుంచి విద్యుత్ సౌకర్యం లేదు. ప్రభుత్వం స్పందించి మా గూడేనికి విద్యుత్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆదివాసీ గ్రామాన్ని ఆదుకోవాలి.

– రావుజీ, కోసుపటేల్ గూడ గ్రామ పటేల్

తాగునీటి సౌకర్యం కల్పించాలి



మా గ్రామానికి ప్రభుత్వం తాగునీటి సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం మేమంతా కలిసి వేసుకున్న బోరు నీటిని తాగుతున్నాం. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించాలి.

– కుంర యాదవ్‌రావు, కోసుపటేల్‌గూడ

ఇండ్లు మంజూరు చేయాలి



కోసుపటేల్ గూడలో ఒక్కరికి కూడా పక్కా ఇళ్లు లేవు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని మా గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.

– పెందుర్ భీంబాయి, కోసుపటేల్‌గూడ

అదృష్టంగా భావిస్తున్నా..



గిరిజన విద్యార్థుల చదువు కోసం కోసుపటేల్ గూడలో పాఠశాల నిర్మించే అవకాశం అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. నేను కూడా మారుమూల గిరిజన గ్రామాల్లో కిలో మీటర్ల దూరం వరకు కాలినడకన వెళ్లి చదువుకున్నా.

– అభినవ్ సర్దార్, ట్రస్టు చైర్మన్

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

లింగాపూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎస్సై కొట్టె ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇసుకకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ ఎదుట బైండోవర్ చేశారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున మూడు ట్రాక్టర్లకు రూ.15వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్‌లో రఘునాథ్


పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: ఢిల్లీలోని భారత మండపంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన నిర్వహిస్తున్న పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు. దేశంలో ఎన్డీఏ కూటమి 400లకు పైగా సీట్లు సాధించి, మూడోసారి కేంద్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలని మోదీ, జేపీ నడ్డాలు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. జిల్లా నుంచి పెద్దపల్లి పార్లమెంటు కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, జాయింట్ కన్వీనర్ మల్లికార్జున్, ఆరుముళ్ల పోషం పాల్గొన్నారు.

కాలువలో పడి ఎద్దు మృతి

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు సదర్మాట్ కాలువలో పడ్డ ఎద్దు మృతిచెందింది. రోజులాగే ఎద్దు కాలువ కట్టపై మేత మేస్తున్న క్రమంలో దాహం వేయడంతో నీటి కోసం ఓ ఎద్దు కాలువలోకి దిగింది. అనంతరం కాలువ ఒడ్డుపైకి ఎక్కేందుకు ప్రయత్నించగా కాలువకు రెండువైపులా సీసీ ప్లాట్‌ఫాం ఉండడంతో ఎక్కేందుకు అవకాశం లేకపోవడంతో ఎద్దు కాలువ దిగువ వైపునకు వెళ్లింది. దీంతో గ్రామ శివారులోని కాలువకు మధ్యలో దిగువన ఉన్న గేట్ల మధ్యన ఇరుక్కుపోయిన మృతిచెందింది. రూ.50వేల పైచిలుకు విలువైన దుక్కిటెద్దు మృతిచెందడంతో బాధిత రైతు గోపి పెద్దరాజన్న ఆందోళన వ్యక్తం చేశాడు. కళ్ల ఎదుటే ఎద్దు ఒక్కసారిగా మృతి చెందడంతో బాధిత రైతు కంటతడిపెట్టాడు. బాధిత రైతుకు ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా చూడాలని గ్రామస్తులు కోరారు.

పించన్ పునరుద్ధరించండి సారూ..


ఎల్ములు శేఖర్

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడకు చెందిన ఎల్ములు శేఖర్‌కు పుట్టుకతోనే కాళ్లు, చేతులు పనిచేయకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. అతని ఆలనాపాలన చూసే తల్లి చంటమ్మ మూడేళ్లక్రితం అనారోగ్యంతో మృతి చెందింది. యువకుడి భారం అతని తండ్రి ఎల్ములు అంకులుపై పడింది. శేఖర్‌కు ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ (19246470370120007) ద్వారా 2019 వరకు దివ్యాంగుల పింఛన్ ఇచ్చింది. పింఛన్ల ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా అతని తండ్రి అంకులు వృద్ధాప్య పింఛన్‌కు సదరం ఐడీ నంబర్ జోడించడంతో యువకుడి పింఛన్ నిలిచిపోయింది. పునరుద్ధరించాలని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కూలి పనులు చేసుకునే నాకు కుమారుడి ఆలనా పాలనా చూడటం భారంగా మారిందని, దివ్యాంగుల పింఛన్ పునరుద్ధరించి ఆదుకోవాలని యువకుడి తండ్రి అధికారులను వేడుకుంటున్నాడు.

ఐఐటీ మెయిన్స్‌లో మెరిసిన విద్యాకుసుమం


విజయ్

కోటపల్లి: మండలంలోని సుపాక గ్రామానికి చెందిన ముత్యం విజయ్ ఇటీవల విడుదలైన ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చాటాడు. ముత్యం సమ్మయ్య, మల్లక్క దంపతుల కుమారుడు విజయ్ ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో 98.9 తో ర్యాంకు సాధించాడు. ఐదోతరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో, కాసిపేటలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి ఇంటర్ చదువుతున్నాడు.

కోల్ సెక్రెటరీకి వినతులు


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించిన సెంట్రల్ కోల్ సెక్రెటరీ అమ్రిత్‌లాల్ మీనాను శనివారం సింగరేణి ఆఫీసర్స్ అసోసియేషన్ (సీఎంఓఏఐ) నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణికి కేటాయించాలన్నారు. ఇతర పెర్క్స్ అలవెన్సులు, కోల్‌ఫీల్డ్ అలవెన్సులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా ఇతర అధికారుల వృత్తి పరమైన సమస్యలు, జీతభత్యాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (అపెక్స్) ఏవీ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కే కిరణ్‌కుమార్, ఎస్టీపీపీ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ వినతి

అమ్రిత్‌లాల్‌ను మీనాను ఐఎన్టీయూసీ నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, నాయకులు భీంరావు, గరిగే స్వామి, వై.సత్యనారాయణ, బొడకుంట ప్రణయ్, గుడ్ల రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

మంచిర్యాలఅర్బన్: విద్యార్థి నేపథ్యం ఏదైనా ఉన్నత లక్ష్యం, ప్రణాళికతో ముందుకెళ్తే ఏస్థాయికైనా చేరుకోవచ్చని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ఉన్నత పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోతరగతి తర్వాత ఏఏ కోర్సులు ఉంటాయి? ఏలక్ష్యానికి ఏకోర్సు ఎన్నుకోవాలనే విషయాలపై వివరించారు. పోటీ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలి? గ్రంథాలయాన్ని ఉపయోగించటం, రోజు వారీ న్యూస్ పేపర్ తప్పకుండా చదవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ క మిషనర్ మారుతీప్రసాద్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, ఏఈ మధుకర్, సెక్టోరల్ అధికారిశ్రీనివాస్,ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు గంటలు ట్రాఫిక్ జామ్


బెల్లంపల్లి చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బెల్లంపెల్లి చౌరస్తాలో శనివారం సాయంత్రం రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. నూతనంగా నిర్మించిన ఐలాండ్ వద్ద రోడ్డు మరమ్మతు పనులు చేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో మరమ్మతు పనులు చేయాలని కోరుతున్నారు.

అనుమతుల మాటున అక్రమ రవాణా

- చెట్లపొదల్లో ఇసుక డంపులు
- అక్రమంగా తరలించి నిల్వ చేసుకున్న వ్యాపారులు
- స్వాధీనం చేసుకుంటే ప్రభుత్వానికి ఆదాయం


అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపు

మంచిర్యాలక్రైం: ఇసుక డంపులు ఉండగా ఆన్‌లైన్ మాకేందుకు అన్న చందంగా వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జనవరి 8న 'గోదావరిలో ఇసుక దొంగలు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ బదావత్ సంతోష్ స్పందించారు. మంగళవారం మైనింగ్ ఏడీ బాలుతో కలిసి మంచిర్యాల కాలేజీరోడ్, వేంపల్లి, పాతమంచిర్యాల, ముల్కల్ల గోదావరిలోని ఇసుక రీచ్‌లను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో మైనింగ్, రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓ కమిటీని ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతనెల 22న హాజీపూర్ మండలం వేంపల్లి గోదావరి నుంచి ఇసుక తీసుకునేందుకు మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారు. అంతకుముందే గోదావరి నుంచి వేలాది ట్రాక్టర్ల ఇసుకను తరలించి రహస్య ప్రాంతాల్లో డంపు చేసుకున్నారు.

అనుమతుల మాటున అక్రమ రవాణా

మైనింగ్ అధికారులు ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇవ్వకముందే వ్యాపారులు వేలాది ట్రాక్టర్ల ఇసుకను డంప్ చేసుకుని పెట్టుకున్నారు. అంతా అయిపోయిన తర్వాత అధికారులు వేంపల్లి సమీపంలో గోదావరి నుంచి ఇసుకను తీసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు ఇచ్చామని అధికారులు నిమ్మకుండి పోతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం వేంపల్లి గోదావరి నుంచి తీసుకునేందుకు ఆన్‌లైన్ అనుమతులు ఇచ్చింది. అయితే ఇసుక వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా ఇసుక కొనుగోలు చేయకుండా తాము ముందస్తుగా అక్రమంగా డంప్ చేసుకున్న నిల్వల నుంచి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయనికి గండి పడుతోంది. ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగిస్తే ఆన్‌లైన్ ద్వారా ఇసుక విక్రయించేందుకు అవకాశం ఉంటుంది. దీంతో ప్రభుత్వానికి కొంతయినా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. వేంపల్లి గోదావరి నుంచి ఇసుక అనుమతులు ఉన్నప్పటికీ నస్పూర్, మంచిర్యాల పట్టణ ప్రజలకు ఇసుక తరలింపు దూరం కావడంతో ఇసుక వ్యాపారులు సమీపంలోని గోదావరి నుంచి ఇసుకను తరలించి నిల్వ చేసుకుంటున్నారు.

రెవెన్యూ అధికారులు సీజ్ చేయాలి



ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి మాకు అప్పగిస్తే ఆన్‌లైన్ ద్వారా ఇసుక డంపులను విక్రయించేందుకు అవకాశం ఉంటుంది. బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ఇసుక డంపులను సీజ్ చేసే అధికారం మాకు లేదు. వేంపల్లి గోదావరి నుంచి ఇసుక అనుమతులు ఇచ్చాం. ఆన్‌లైన్ రిసిప్ట్ లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

– బాలు, జిల్లా మైనింగ్ శాఖ అధికారి, మంచిర్యాల

కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి


టెక్నికల్ అసిస్టెంట్ల వివరణ వింటున్న అధికారులు

తాండూర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీఆర్‌డీవో పీడీ కిషన్ అన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ 2.82 కోట్ల రూపాయాలతో మండల వ్యాప్తంగా నిర్వహించిన 152 రకాల పనులపై సామాజిక తనిఖీ బృందం ప్రజా వేదికలో నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల పరిధిలో మొక్కల పెంపకంలో ముఖ్యంగా మల్టీ లెవల్ అవెన్యూ ప్లాంటేషన్‌ల విషయంలో అజాగ్రత్త వహించినందుకు కార్యదర్శులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు డీఆర్‌డీవో కిషన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీటీసీలు సూరం రవీందర్‌రెడ్డి, సిరంగి శంకర్, ఏపీడీ దత్తారావ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్


నెన్నెలలో రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ

నెన్నెల: నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. శనివారం నెన్నెల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి 5ఎస్ అములు తీరును పరిశీలించారు. ఇప్పటి వరకు స్టేషన్‌లో నమోదైన కేసులు, రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని సీఐ, ఎస్సైలకు సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దొంగతనాలు జరుగకుండా చూసుకోవాలని ఎస్సై శ్యాం పటేల్‌ను ఆదేశించారు. గుడుంబా, గంజాయి, నకిలీ విత్తనాల తయారీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి, తాండూర్ సీఐలు అఫ్జలొద్దీన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భీమిని: నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఏసీపీ రవి కుమార్ అన్నారు. శనివారం భీమిని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు దారుల పట్ల సానుకూలంగా స్పందించాలన్నారు. పోలీసు సిబ్బందికి ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.